అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
శుక్రవారం 20, డిసెంబర్ 2024 | సంపుటి :02 | సంచిక :270 | పేజీలు :04

బీఆర్ఎస్‌లో కలకలం

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు

పొలిటికల్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్ వ్యవహారం

05

కేటీఆర్‌కు ఊరట..

- 30వ తేదీ వరకు అరెస్ట్ చేయొద్దు
- ఏసీబీకి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 27కు వాయిదా
- ఫార్ములా ఈ -రేస్ వ్యవహారంలో కీలక పరిణామం

05

మొదలైందా ?

మల్టీ జోన్ -2లో గతంలో ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై వేటు

- ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన 16 మంది అధికారులపై చర్యలు
- తొమ్మి ది జిల్లాల పరిధిలో పలువురి బదిలీలు
- మల్టీజోన్ 1 పరిధిలోనూ ప్రక్షాళన షురూ ?

02

గతంలో మల్టీ జోన్ 2లోని తొమ్మి ది జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, 13 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లపై వేటుపడటం అప్పట్లో పోలీస్ శాఖలో కలకలం రేపింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం సృష్టించింది. మామూళ్లు తీసుకోవడం, వసూళ్లు చేయడం, అక్రమార్కులతో అంటకాగడంవంటి పలు ఆరోపణతో వీరిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో కొంతమందిని బదిలీ కూడా చేశారు. అయితే మల్టీ జోన్ 1 పరిధిలోని జిల్లాల్లోనూ అవినీతి అధికారులపై చర్యలుండే అవకాశం ఉందని అంతా భావించినప్పటికీ ఏ అధికారిపైనా వేటుపడలేదు. ఈక్రమంలోనే జాగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేయడంతో కొంత ఆలస్యమైనా ఇక్కడ కూడా ప్రక్షాళన ప్రారంభమైందనే చర్చ తెరపైకి వచ్చింది. ప్రధానంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తోపాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అక్రమ ఇసుక మాఫియా, అక్రమ పీడీఎస్ రైస్ మాఫియా, అక్రమ గ్రానైట్ మాఫియాకు డిపార్ట్‌మెంట్‌లోని కొందరు ఆఫీసర్లు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి అధికారుల పేర్లను ఇప్పటికే నిఘా విభాగాలు సేకరించినట్లు, ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఎస్సై రాజ్‌కుమార్‌పై వేటు పడిందా..? అన్న టాక్ డిపార్ట్‌మెంట్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

– అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- ఎస్సై రాజ్‌కుమార్‌పై కొంతకాలంగా అవినీతి ఆరోపణలు
- మరికొందరు అధికారులపైనా త్వరలో చర్యలు ?
- ఇక్కడా యథేచ్ఛగా ఇసుక, గ్రానైట్ అక్రమ రవాణా
- పలు జిల్లాల్లో జోరుగా జీరో దందా..
- పీడీఎస్ రైస్ అక్రమ ట్రాన్స్‌పోర్ట్‌కు ఖాకీల హెల్ప్
- ఈక్రమంలోనే ఎల్కతుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

ఇరవై రోజులు.. ఏడు హత్యలు

- ఉమ్మ డి జిల్లాలో సంచలనం సృష్టిస్తున్న వరుస ఘటనలు
- వరంగల్ నగరంలోనే ఇటీవల రెండు మర్డర్లు..
- కమిషనరేట్ పరిధిలో ఈఏడాది ఇప్పటి వరకు 35 హత్యలు, 105 హత్యాయత్నం కేసులు
- భూవివాదాలు, ఆస్తి గొడవలే ప్రధాన కారణం..
- చావుకు దారితీస్తున్న వివాహేతర సంబంధాలు

03

కొత్తగా 3 మున్సిపాలిటీలు

- కేసముద్రం, స్టేషన్ ఘన్‌పూర్, మద్దూరుకు మహర్దశ
- త్వరలోనే అప్‌గ్రేడ్ అవనున్న గ్రామ పంచాయతీలు
- తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్
- ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులే తరువాయి
- ఉమ్మ డి జిల్లాలో ఇప్పటికే 9 మున్సిపాలిటీలు
- కొత్తవాటితో కలుపుకొని 12కు చేరనున్న సంఖ్య
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- మెరుగుపడనున్న మౌలిక వసతులు, ప్రాథమిక సేవలు

04

ఓవర్ లోడ్ దందా మళ్లీ షురూ

- నిబంధనలకు విరుద్ధంగా బొగ్గు రవాణా
- కలెక్టర్ ఆదేశాలు తుంగలో తొక్కిన వైనం
- పాసింగ్ ను పాటించని కాంట్రాక్టర్లు, కంపెనీ
- వ్యవస్థను శాసిస్తున్నాం.. ఏం కాదంటూ ఓవర్
- ఇక్కడంతా మా ఇష్టమేనని జులూం
- టార్గెట్ రీచ్ పేరుతో ఓవర్ లోడ్ దందా

05

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

మొదలైందా?

- మల్టీ జోన్ -2లో గతంలో ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై వేటు
- ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన 16 మంది అధికారులపై చర్యలు
- తొమ్మిది జిల్లాల పరిధిలో పలువురి బదిలీలు
- మల్టీజోన్ 1 పరిధిలోనూ ప్రక్షాళన షురూ ?
- ఇక్కడా యథేచ్ఛగా ఇసుక, గ్రానైట్ అక్రమ రవాణా
- పలు జిల్లాల్లో జోరుగా జీరో దందా..
- పీడీఎస్ రైస్ అక్రమ ట్రాన్స్‌పోర్ట్‌కు ఖాకీల హెల్ప్
- ఈక్రమంలోనే ఎల్కతుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్పై సస్పెన్షన్ వేటు
- అక్రమ దందాలకు వత్తాసు పలుకడమే ప్రధాన కారణం
- ఎస్సై రాజ్‌కుమార్‌పై కొంతకాలంగా అవినీతి ఆరోపణలు
- మరికొందరు అధికారులపైనా త్వరలో చర్యలు ?

అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి:

సస్పెన్షన్‌కు గురైన ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్

గతంలో మల్టీ జోన్ 2లోని తొమ్మిది జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, 13 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లపై వేటుపడటం అప్పట్లో పోలీస్ శాఖలో కలకలంరేపింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం సృష్టించింది. మామూళ్లు తీసుకోవడం, వసూళ్లు చేయడం, అక్రమార్కులతో అంటకాగడంవంటి పలు ఆరోపణలతో వీరిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో కొంతమందిని బదిలీ కూడా చేశారు. అయితే మల్టీ జోన్ 1 పరిధిలోని జిల్లాల్లోనూ అవినీతి అధికారులపై చర్యలుండే అవకాశం ఉందని అంతా భావించినప్పటికీ ఏ అధికారిపైనా వేటుపడలేదు. ఈక్రమంలోనే జాగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేయడంతో కొంత ఆలస్యమైనా ఇక్కడ కూడా ప్రక్షాళన ప్రారంభమైందనే చర్చ తెరపైకి వచ్చింది. ప్రధానంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తోపాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అక్రమ ఇసుక మాఫియా, అక్రమ పీడీఎస్ రైస్ మాఫియా, అక్రమ గ్రానైట్ మాఫియాకు డిపార్ట్‌మెంట్‌లోని కొందరు ఆఫీసర్లు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి అధికారుల పేర్లను ఇప్పటికే నిఘా విభాగాలు సేకరించినట్లు, ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఎస్సై రాజ్‌కుమార్‌పై వేటు పడిందా..? అన్న టాక్ డిపార్ట్‌మెంట్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ ఖాకీల హల్ చల్..

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకలు ఆగస్టు 20న జరిగాయి. కొండా అభిమానులతోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు నగరంలో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారు. ఇక్కడిదాకా బాగానే ఉన్నా.. ఈ వేడుకల్లో పోలీసులు పాల్గొనడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నిఫామ్‌లో పాల్గొన్న కొందరు పోలీసులు.. ఏకంగా కేక్ కట్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో స్వయంగా ఓ ఏసీపీ, సీఐ, సిబ్బంది సైతం పాల్గొనదంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టాయి. తాజాగా ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్ సైతం అలాంటి వివాదంలోనే ఇరుక్కొని బుక్ అయ్యారనే టాక్ వినిపిస్తోంది. ఇటీవల కరీంనగర్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బంధువు పుట్టిన రోజు వేడుకల్లో ఎస్సై పాల్గొన్నాడని, దీన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని ఆయనపై వేటు వేసినట్లు తెలుస్తోంది.

ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజ్ కుమార్ సస్పెన్షన్

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజ్‌కుమార్‌పై వేటుపడింది. విధుల్లో నుంచి ఆయన్ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై రాజ్‌కుమార్‌పై కొంతకాలంగా అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక, పీడీఎస్, గ్రానైట్ తయారీ పరిశ్రమల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. పర్మీషన్ లేకుండానే ఇటీవల కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ బంధువు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడాన్ని సీరియస్‌గా తీసుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎస్సైని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. సదరు ఎస్సై రాజ్‌కుమార్ ఏడాదిన్నరపాటు ఎల్కతుర్తిలో విధులు నిర్వహిస్తుండగా, అంతకు ముందు హనుమకొండలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అక్కడ కూడా ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పెద్ద ఎత్తున అక్రమాస్తులు కూడబెట్టారనే విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఎస్సైపై సస్పెన్షన్ వేటుపడటం డిపార్ట్‌మెంట్‌లో చర్చనీయాంశమైంది. కమిషనరేట్ పరిధిలోని మరికొందరిపైనా త్వరలోనే సస్పెన్షన్ వేటు పడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కాగా ఇప్పటి వరకు ఎల్కతుర్తిలో ఎస్సైగా విధులు నిర్వహించిన ఏ అధికారి కూడా సస్పెన్షన్‌కు గురైన చరిత్ర లేదని.. ఇదే తొలిసారి అని సమాచారం.

మీడియాతో మాట్లాడుతున్న సునీల్ రెడ్డి

మంత్రి అండతోనే భూముల రిజిస్ట్రేషన్లు

రైతుల పక్షాన బీజేపీ పోరాడుతుంది

పెద్దపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సునీల్ రెడ్డి

అక్షర దర్బార్, మహాదేవపూర్ : పలిమెల మండలంలో భూ కుంభకోణం మంత్రి అండదండలతోనే కొనసాగిందని పెద్దపెల్లి జిల్లా బిజెపి అధ్యక్షుడు సునీల్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పలిమెల మండలంలో అక్రమంగా సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ అయిన భూముల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు రైతులకు జేసీతో సర్వే చేయించారని తెలిపారు. ప్రస్తుతం సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే తన అనుచరులకు లాభం జరిగేలా 102 ఎకరాల భూమిని డెక్కన్ సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయించడం తెలియదన్నట్లు వ్యవహరించడం మళ్లీ తానే విచారణ చేపట్టమన్నట్లు అధికారులకు సూచించడం సిగ్గు చేటని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలిమెల, మహాదేవపూర్, కాటారం మండలాల బిజెపి అధ్యక్షులు కోయల్ కార్ నిరంజన్, ఆకుల శ్రీధర్, సమ్మిరెడ్డి తోపాటు నాయకులు ఐలయ్య, జనగామ పోశం బాధిత రైతులు పాల్గొన్నారు.

పద్మశాలీల ఐక్యతకు పాటుపడదాం

సంఘం మీడియా కార్యదర్శి కృష్ణమూర్తి

అక్షరదర్బార్, చిల్పూర్: పద్మశాలీల ఐక్యతకు పాటుపడదామని ఐకమత్యమే మన బలమని, ప్రతి ఒక్కరు స్నేహభావంతో ముందుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గజ్జల దామోదర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామ జిల్లా చిన్న పెండ్యాల గ్రామంలో వారు మాట్లాడుతూ పద్మశాలీలు సంఘటితంగా ఉండాలని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ప్రతి ఒక్కరూ స్పందించాలని, స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలని పేర్కొన్నారు. పద్మశాలీలు రాజకీయాలకు అతీతంగాముందుకు వెళ్లాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక గణేష్ చౌక్ నుంచి అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి ఎస్సై శ్రీలత సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని టాటా మినీ వ్యాన్ వాహనంలో సుమారు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలించే ప్రయత్నం చేస్తుండగా అదుపుకొని వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించారు. భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన మూల రమేష్ ,పల్లె గణేష్, భూపాలపల్లికి చెందిన రాజుపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

అడవిలో మహిళ అనుమానాస్పద మృతి

అక్షర దర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అంకుశాపూర్ అటవీ ప్రాంతంలో ఓ మహిళా మృతదేహం లభించడం కలకలం సృష్టించింది. ఎస్సై అభినవ్ వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలం కేమలాపూర్ గ్రామానికి చెందిన కాల్వ శారద(30) భర్తతో గొడవ పడి గత ఐదేళ్లుగా తల్లితో ఉంటోంది. ఈ క్రమంలో బంధువుల గ్రామమైన కాటారం మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి వచ్చి వెళ్తుండేది. అయితే గత మంగళవారం ఇంటికి సంబంధించిన టైల్స్ కోసం వెళ్లిన శైలజ తిరిగి రాకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కాగా శైలజ మృతదేహం అంకుశాపూర్ అటవీ ప్రాంతంలో కనిపించడంతో పోలీసులు గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. కాగా, మృతురాలికి అంకుశాపూర్ గ్రామానికి చెందిన ఇనుగాల రమేష్ తో వివాహేతర సంబంధం ఉందని, అతడే హత్య చేసి ఉంటాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్సై వెల్లడించారు.

రాహుల్ గాంధీని అరెస్టు చేయాలి

బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల ధశమంత్ రెడ్డి

అక్షర దర్బార్,తొర్రూరు : బీజేపీ సంస్థాగత పర్వంలో భాగంగా మండలంలోని అమ్మాపురం గ్రామంలో బూత్ కమిటీ ఎన్నికల సమావేశం బీజేపీ తొర్రూరు రూరల్ మండల అధ్యక్షుడు బొచ్చు సురేష్ యాదవ్ సభాధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల ధశమంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. పార్లమెంటు వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న క్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దురుసుగా ప్రవర్తించి మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ పార్లమెంటేరియన్ సారంగిని నెట్టివేసి గాయాల పాలు చేశాడని వెంటనే రాహుల్ గాంధీ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాంమోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజ శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు, దొంగరి మహేందర్, జిల్లా కార్యదర్శులు రచ్చ కుమార్, మోడపల్లి సోమన్న, నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్, తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా, మండల శక్తి కేంద్రం ఇంచార్జీలు మరియు వివిధ మోర్చాల బాధ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులు గట్టు రాంబాబు, విష్ణు వర్ధన్ చారి, కాగు నవీన్, శ్రీకాంత్, నిరంజన్ రెడ్డి, నవీన్ రెడ్డి, గుండా సురేష్, విశాల్, రాజ్ కుమార్, నవీన్, యాకయ్య, పాండు, శ్రీరాములు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ధశమంత్ రెడ్డి

ఇరవై రోజులు.. ఏడు హత్యలు

- ఉమ్మడి జిల్లాలో సంచలనం సృష్టిస్తున్న వరుస ఘటనలు
- నగరంలోనే ఇటీవల రెండు మర్డర్లు..
- కమిషనరేట్ పరిధిలో ఈఏడాది ఇప్పటి వరకు 35 హత్యలు, 105 హత్యాయత్నం కేసులు
- భూవివాదాలు, ఆస్తి గొడవలే ప్రధాన కారణం..
- చావుకు దారితీస్తున్న వివాహేతర సంబంధాలు

5 గుంటల భూమి కోసం తమ్ముడి చేతిలో హత్యకు గురైన అన్న సారయ్య (ఫైల్)

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి : ఆస్తి కోసం తోబుట్టువులనే చంపేసిన ఘటనలు, అనుమానం, పాత కక్షలతో కడతేర్చిన దారుణాలు, ప్రేమ పేరుతో ఉన్మాదాలు, వేధింపులు భరించలేక ప్రాణాలు తీయడం.. ఇలా ఏదో ఒక నెపంతోనో, అత్యాశతోనో తోటివారి ప్రాణాలు తీస్తున్నారు. క్షణికావేశంలో దారుణాలకు ఒడిగడుతూ కటకటాల పాలవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటువంటి హత్యా సంస్కృతి క్రమంగా విస్తరిస్తోంది. గడిచిన ఇరవై రోజుల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏడు హత్యలు జరగడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. అధికారిక లెక్కల ప్రకారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు 35 హత్యలు, 105 హత్యాయత్నం కేసులు నమోదవడం గమనార్హం. ఇందులో కొన్ని ఆస్తి, కుటుంబ తగాదాలు కాగా, మరికొన్నింటిలో భూవివాదాలు, వివాహేతర సంబంధాలు హత్యలకు కారణమవుతున్నాయి. పట్టపగలే దారుణాలు జరుగుతుండగా పోలీసుల నిఘా వ్యవస్థపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వరుస ఘటనలు డిపార్ట్‌మెంట్‌కు సవాల్ విసురుతున్నాయి.

అడవిలో మహిళ..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుశాపూర్ శివారులోని అడవిలో ఓ మహిళ హత్యకు గురైంది, వివాహేతర సంబంధం కారణంగానే హత్య జరిగినట్లు తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన కాలువ శైలజ (38)కు అంకుశాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర బంధం ఏర్పడింది. కొన్ని రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతుండటంతో నిందితుడిపై కేసు పెట్టింది. ఈక్రమంలోనే సదరు వ్యక్తి మూడు రోజుల క్రితం మహిళను అడవిలోకి తీసుకెళ్లి హత్య చేశాడు. శుక్రవారం పోలీసుల ముందు అసలు విషయం చెప్పి లొంగిపోయాడని తెలిసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రీమాబాద్ లో వలస కూలీ..

బిహార్‌కు చెందిన మునిదిల్‌కుష్ కుమార్ (16) ఉపాధి కోసం మూడు నెలల క్రితమే కరీమాబాద్కు వచ్చాడు. అన్న ముని దూలర్ చంద్రకుమార్‌తో ఎస్ఆర్ఆర్ తోటలో ఉంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అదే ప్రాంతంలో ఉంటున్న బానోతు నగేశ్తో పరిచయమైంది. సమీపంలోనే నగేశ్ అత్తగారిల్లు ఉండటంతో అతని భార్యా పిల్లలు వచ్చి వెళ్తుండేవారు. కొన్ని రోజుల క్రితం అన్నదమ్ములు దిల్‌కుష్ కుమార్, ముని దూలర్ చంద్రకుమార్ తన భార్య వైపు చూస్తున్నారంటూ నగేశ్ వారితో గొడవపడ్డాడు. తర్వాత అన్నదమ్ములిద్దరినీ చంపుతామంటూ బెదిరిస్తూ దాడికి పాల్పడగా, ముని దూలర్ చంద్రకుమార్ తప్పించుకుని పారిపోయాడు. ఆ తర్వాత నిందితులు ఇంట్లో నిద్రిస్తున్న దిల్‌కుష్‌కుమార్‌పై ఇనుప రాడ్‌తో కొట్టి అంతమొందించారు. సీసీటీవీ కెమెరాల ఆధారంగా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

5 గుంటల భూమి కోసం అన్నను..

ఐదు గుంటల భూమి కోసం సొంత అన్నను తమ్ముడు, మరో తమ్ముడి భార్య కలిసి దారుణంగా నరికి చంపారు. ఈ ఘటన ఈనెల 14న భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో జరిగింది. దేవరాంపల్లి గ్రామానికి చెందిన మారపాక సారయ్య (50)కు సోదరుడు సమ్మయ్య, మరో సోదరుడి భార్య (మరదలు) లక్ష్మితో కొంతకాలంగా భూముల విషయంలో వివాదాలు జరుగుతున్నాయి. 5 గుంటల భూమిని కుటుంబంలో పెద్దవాడైన సారయ్యకు ఇవ్వాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. తమ్ముడు సమ్మయ్య, మరో తమ్ముడి భార్య లక్ష్మి నిరాకరించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి పెద్ద కుమారుడు శ్రీరామ్‌తో కలిసి సారయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా శంకరాంపల్లి వద్ద కాపుకాసిన తమ్ముడు సమ్మయ్య, మరదలు లక్ష్మి, మరో ముగ్గురితో కలిసి వారిపై కారంచల్లి గొడ్డలి, రాడ్లు, ఇనుప సుత్తితో దాడిచేసి సారయ్యను అంతమొందించారు. శ్రీరామ్ తప్పించుకొని ప్రాణాలతో బయటపడ్డాడు. ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

అనుమానంతో భార్యను ఉరేసి చంపిన భర్త

అనుమానం..పెను భూతమైంది. ఓ ప్రబుద్ధుడు భార్యను ఉరివేసి హత్య చేశాడు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసి పోలీసులకు దొరికిపోయాడు. ఈఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలకేంద్రంలో డిసెంబర్ 2న చోటుచేసుకుంది. కేసముద్రం స్టేషన్‌కు చెందిన బత్తుల వీరన్నకు అదే మండలం బోడ మంచ్యాతండాకు చెందిన అనూష(30)తో 2011లో వివాహమైంది. కొంతకాలంగా భార్యపై అనుమానంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే ఈనెల 2న అర్ధరాత్రి వీరన్న తన భార్య అనూషను ఉరివేసి హత్యచేశాడు. అనంతరం ఇంటి వెనుక బావి దూలానికి వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఆపై అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి బత్తుల వీరన్నను అరెస్ట్ చేసి కటకటాల్లోకి పంపారు.

అప్పు ఇవ్వనందుకే మర్డర్

వరంగల్‌లో బ్యాంకు రిటైర్డు మేనేజర్ ఎలిగేటి రాజమోహన్ (64) ఈనెల 2న దారుణ హత్యకు గురయ్యాడు. వరంగల్ నగరంలో కలకలం సృష్టించిన మర్డర్ మిస్టరీని ఈనెల 8న పోలీసులు ఛేదించారు. అప్పు ఇస్తానని చెప్పి ఇవ్వనందుకే ములుగు జిల్లా మంగపేట మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన మాజీ యూట్యూబ్ జర్నలిస్ట్ శ్రీనివాసరావు ఈ దారుణానికి ఒడిగట్టినట్టు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. శ్రీనివాసరావు తన బిజినెస్ కు రూ.5 లక్షల వరకు అవసరం అవుతాయని, తనకు అప్పుగా ఆ మొత్తాన్ని ఇవ్వాల్సిందిగా రాజా మోహన్ ను అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో శ్రీనివాసరావు రాజా మోహన్ పై ఒత్తిడి పెంచాడు. దీంతో రాజా మోహన్ తన వద్ద డబ్బులు లేవని, అప్పు ఇవ్వడం కుదరదని చెప్పేశాడు. దీంతో కసి పెంచుకున్న శ్రీనివాసరావు రాజా మోహన్ ను పథకం ప్రకారం అంతమొందించాడు.

భార్య కూతురు కలిసి దారుణం..

గీసుకొండ మండలం శాయంపేట హవేలీకి చెందిన చెందిన కోటగిరి సునీల్ (38) దారుణ హత్య గ్రామంలో కలకలంరేపింది. భార్యా కూతురు కలిసి నవంబర్ 30న హత్యచేశారు. కుమార్తె ఓ యువకుడిని ప్రేమిస్తున్నట్లు తెలియడంతో సునీల్ భార్యతోపాటు యువతిని మందలించాడు. ఈక్రమంలోనే ముగ్గురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కోపంపెంచుకున్న తల్లీ కూతురు ఇద్దరూ కలిసి దారుణానికి ఒడిగట్టారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో సునీల్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారు.

చంద్రుపల్లిలో యువకుడు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం చంద్రుపల్లిలో నవంబర్ 28న యువకుడు దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. నడి రోడ్డుపై ఇద్దరు వ్యక్తులు కత్తితో పొడిచి చంపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కొమ్మెరకు చెందిన ముత్యాల శ్రీకాంత్ (25) తన వరి కోత యంత్రాన్ని మహదేవ్‌పూర్ మండలం చంద్రుపల్లికి తీసుకొచ్చి పనులు చేపడుతున్నాడు. ఈక్రమంలోనే పనులు ముగించుకొని కారులో వెళ్తుండగా బైక్ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కారుపై దాడిచేశారు. డ్రైవర్ పరుగులు పెట్టగా, శ్రీకాంత్‌ను నరికి హత్య చేశారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు నిర్ధారించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనం

చెన్నారావు పేటలో దిష్టిబొమ్మ దహనం

అక్షరదర్బార్, హనుమకొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే భారత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని గ్రేటర్ వరంగల్ ఎస్సీ వర్గీకరణ వ్యతి రేక పోరాట సమితి కన్వీనర్ పనికెల శ్రీనివాస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ సమితి నాయకులు దండు మోహన్, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ కేయూ ఇంచార్జి పండు డిమాండ్ చేశారు. భారత పార్లమెంట్ సాక్షిగా విశ్వ విజ్ఞాని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం హన్మకొండ అంబేద్కర్ సెంటర్ లో గ్రేటర్ వరంగల్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ సమితి, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వార చట్ట సభల్లోకి వచ్చిన అమిత్ షా బాధ్యతగల కేంద్ర హోంమంత్రిగా ఉండి మతోన్మాదిగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వెంటనే అమిత్ షాను పదవి నుంచి తొలగించి, ఆయనపై దేశ ద్రోహం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పానుగంటి లక్ష్మీ నారాయణ, సాదు కుమారస్వామి, సురాశి విక్రమ్, కాశేశ్వరపు రాము, కదారి కుమార్, గూడెపు ఐలయ్య, సంపతి రఘు, కునమళ్ల అనిత, దాసరి రాజేశ్వరి, ఆకుల సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేటలో..

అక్షర దర్బార్, నర్సింహులపేట : అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సామాజిక ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నర్సింహులపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో హల్యాల వీరయ్య, గునిగంటి మోహన్, మందుల యాకూబ్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు

చెన్నారావుపేటలో దిష్టిబొమ్మ దహనం

అక్షరదర్బార్,చెన్నారావుపేట: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చెన్నారావుపేట మండల కేంద్రంలో సీపీఎం (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పరికి మధుకర్ మాట్లాడుతూ అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నెక్కొండ ఏరియా కమిటీ సభ్యులు ఏనుగుతల నరేష్,జన్ను,రమేష్,ఐలయ్య అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ నాయకులు జన్ను రవి,కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎండి బాష్మియా, నాయకులు తాటికాయల మధు, చిలపాక ప్రవీణ్, కుక్కల నవీన్, రాజ్ కుమార్ తదితరులుపాల్గొన్నారు.

నర్సింహుల పేటలో అమిత్ షా చిత్రపటం దహనం

తొర్రూరులో..

అక్షర దర్బార,తొర్రూరు : పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేష్ తెలిపారు. పీఎం మోదీ స్పందించి అమిత్ షాను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయకుంటే భవిష్యత్తులో జాతీయ మాల మహానాడు పక్షాన తీవ్ర నిరసన ఉంటుందన్నారు.

శుక్రవారం
20.12.2024
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కొత్తగా 3 మున్సిపాలిటీలు

- కేసముద్రం, స్టేషన్ ఘన్‌పూర్, మద్దూరుకు మహర్దశ
- త్వరలోనే అప్‌గ్రేడ్ అవనున్న గ్రామ పంచాయతీలు
- తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్
- ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులే తరువాయి
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 9 మున్సిపాలిటీలు
- కొత్తవాటితో కలుపుకొని 12కు చేరనున్న సంఖ్య
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- మెరుగుపడనున్న మౌలిక వసతులు, ప్రాథమిక సేవలు

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌తోపాటు ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 9 మున్సిపాలిటీలు ఉండగా.. కొత్తగా మరో మూడు ఏర్పాటు కానున్నాయి. దీంతో ఆ సంఖ్య 12కు చేరనుంది. ప్రస్తుతం మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్న కేసముద్రం, స్టేషన్ ఘన్‌పూర్, మద్దూరు త్వరలోనే మున్సిపాలిటీలుగా అవతరించనున్నాయి. కొద్దిరోజుల కిందట ప్రతిపాదిత మున్సిపాలిటీలు, విలీన గ్రామాల్లో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ జరిపి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆఫీసర్ల ప్రపోజల్స్ మేరకు రాష్ట్ర పురపాలకశాఖ కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు రాగానే కొత్త మున్సిపాలిటీలు కొలువుదీరనున్నాయి. కాగా.. ఇప్పటి వరకు పంచాయతీలుగా ఉన్న కేసముద్రం, స్టేషన్ ఘన్‌పూర్, మద్దూరు త్వరలోనే మున్సిపాలిటీలుగా అగ్‌గ్రేడ్ కానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మౌలిక వసతులు, సేవలు మెరుగవుతాయని ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉండగా.. దాంతోపాటు హనుమకొండ జిల్లాలో పరకాల, వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట, నర్సంపేట, మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, జనగామ జిల్లాలో జనగామ మున్సిపాలిటీలున్నాయి. ఇదిలాఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణీకీకరణపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి ప్రపోజల్స్, ఆబ్జెక్షన్స్ తీసుకున్న మున్సిపల్ శాఖ.. ఆ తరువాత గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించింది. నేతల వినతులు, ప్రజల అభిప్రాయాలను క్రోడీకరించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా మరో మూడు మున్సిపాలిటీలను ఏర్పాటు చేసేందుకు సర్కార్ సిద్ధమైంది.

కేసముద్రం మున్సిపాలిటీ..

కేసముద్రం విలేజ్, కేసముద్రం టౌన్‌తోపాటు అమీనాపురం, ధనసరి, సబ్‌స్టేషన్ తండాలను కలుపుతూ కేసముద్రం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ : స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు..

మద్దూరు మున్సిపాలిటీ..

గతంలో వరంగల్ జిల్లాలో ఉన్న ఈ మండలం ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉంది. హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మద్దూరు మూడు, నాలుగు గ్రామాలను కలుపుకొని త్వరలోనే మున్సిపాలిటీ అవతరించనుంది.

అభివృద్ధి కోసమే.. అసెంబ్లీ

మంత్రి శ్రీధర్ బాబు

ప్రస్తుతం మున్సిపాలిటీలుగా ఉన్న మహబూబ్‌నగర్, మంచిర్యాలను కార్పొరేషన్లుగా మారుస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో ప్రకటించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో కొత్తపల్లి మున్సిపాలిటీని విలీనం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కొత్తగా 12 ప్రాంతాలను మున్సిపాలిటీలుగా మార్చుతున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. కోహీర్, గుమ్మడిదల, గడ్డపోతారం, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, మద్దూర్, దేవరకద్ర, కేసముద్రం, స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట, ఏదులాపురం పంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో పట్టణాభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. కాగా, ప్రభుత్వ నిర్ణయం తో స్థానిక అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆశిస్తున్నా రు. ముఖ్యంగా పంచాయతీలను మున్సిపాలిటీలుగా మా ర్చడం ద్వారా సౌకర్యాలు మెరుగవుతాయని భావిస్తున్నారు. స్థానిక ప్రజలకు మౌలిక వసతులు అందించడంలో ఈ మార్పు దోహదం చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

విద్యార్థి నిరుద్యోగ జేఏసీ నుంచి శ్యామ్ సస్పెండ్

అక్షర దర్బార్,తొర్రూరు : తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మానవతారాయ్ ఆదేశాల మేరకు విద్యార్థి నిరుద్యోగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న వెలిశాల శ్యామ్ ను సంఘం నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా చైర్మన్ పంతం విజేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సంఘం కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో రాష్ట్ర కమిటీ తొలగించమని ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వేల్పుకొండ సురేష్, నరేష్, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రో స్కై బయో మందుల దుకాణం సీజ్

అక్షర దర్బార్, మహాదేవపూర్: మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఆగ్రో స్కైబయో మందుల దుకాణాన్ని వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. వ్యవసాయ శాఖ ఎ డి ఏ, ఏ ఓ లు సంయుక్తంగా బయో ఫర్టిలైజర్ మరియు పెస్టిసైడ్ దుకాణం పై దాడులు నిర్వహించగా బల్కుగా డ్రమ్ములో పెస్టిసైడ్ తీసుకొచ్చి బాటిలింగ్ చేసి స్టిక్కరింగ్ చేసి అమ్ముతున్నారని అలాగే స్టాక్ రిజిస్టర్, బిల్స్ సరిగా మెయింటైన్ చేయకుండా ఇష్టం వచ్చిన రీతిలో షాపు నిర్వాహణ చేస్తున్నారని ఈ తనికి లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 13 లక్షల రూపాయల పురుగు మందులు దొరికాయని వాటిని స్వాధీనపరచుకొని కేసు నమోదు చేశామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పురుగుమందులను డ్రమ్ముల్లో తీసుకువచ్చి బాటిల్ల ల్లో నింపి స్టిక్కర్వేసి రైతులను మోసగిస్తున్నారని వారి పేర్కొన్నారు. ఈ దాడుల్లో మహాదేవపూర్ ఎడిఎ శ్రీపాల్ ఏవో లు పాల్గొన్నారు.

మందులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నాలుగు రోజుల జైలు

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలే

మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్

అక్షర దర్బార్, మహాదేవపూర్ : మండలంలోని ఎలికేశ్వరం గ్రామానికి చెందిన గాడిపల్లి దేవేందర్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పోలీసులు వాహన తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో దొరకగా అతనిని కోర్టులో హాజరు పరచగా కోర్టు వెయ్యి రూపాయల జరిమానా తో పాటు నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని, నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ఉద్మృతం చేస్తామని సూచించారు.

ఘనంగా ఎట్ హోం..

- బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ప్రముఖుల సందడి
- తేనీటి విందులో రాష్ట్రపతి, గవర్నర్, సీఎం, మంత్రులు..

అక్షరదర్బార్, హైదరాబాద్: శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము హైదరాబాద్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. శుక్రవారం సాయంత్రం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. ఈ తేనీటి విందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

మళ్లీ మొదలైన
బొగ్గు ఓవర్ లోడ్ దందా!

- కలెక్టర్ ఆదేశాలు తుంగలో తొక్కిన వైనం
- పాసింగ్ ను పాటించని కాంట్రాక్టర్లు, కంపెనీ
- వ్యవస్థను శాసిస్తున్నాం.. ఏం కాదంటూ ఓవర్
- ఇక్కడంతా మా ఇష్టమేనని జులూం
- టార్గెట్ రీచ్ పేరుతో ఓవర్ లోడ్ దందా

అక్షర దర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓపెన్ కాస్ట్ నుండి బొగ్గు ఓవర్ లోడ్ దందా మళ్లీ మొదలైంది. లారీ కాంట్రాక్టర్లు, సంబంధిత కంపెనీ,జెన్కో అధికారులు కుమ్మక్కై బజాప్తా బరితెగించి బొగ్గు ఓవర్ లోడ్ దందాకు తిరిగి తెరలేపారు. తమకిష్టమొచ్చినట్లుగా ఓవర్ లోడ్ ను వేసుకుని రోడ్లపై ఇష్టరీతిగా వెళ్తుండగా కాటారం టూ భూపాలపల్లి వరకు గల ప్రధాన రహదారులు మళ్లీ ఛిద్రం కానున్నాయి. రోడ్లు, ప్రజలు ఎటుపోతే మాకేంటని మా స్వలాభమే మాకు ముఖ్యమంటూ యథావిధిగా బొగ్గు ఓవర్ లోడ్ కార్యానికి సదరు వ్యక్తులు పూనుకున్నారు. ఓ వైపు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బొగ్గు ఓవర్ లోడ్ ను సహించేది లేదంటూ షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పటికీని అదంతా మా దగ్గర నడవదంటూ సదరు కాంట్రాక్టర్లు, కంపెనీ, జెన్కో అధికారులు కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కడం గమనార్హం.గత వారం రోజులుగా బహిరంగంగానే ఓవర్ లోడ్ దందా కొనసాగుతుండగా సంబంధిత అధికార యంత్రాంగం మౌనం వహించడం పట్ల పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి సీల్డ్ కవర్ల బరువు పెరగడంతోనే అధికారులు సైలెంట్ అయిపోయారన్న వాదనలు ప్రజల నుండి అంతే బలంగా వినిపిస్తున్నాయి. కాగా ఇంతలా తాడిచర్ల ఓపెన్ కాస్ట్ పారిశ్రామికులు జులాం ప్రదర్శి స్తున్నప్పటికీ పట్టించుకోవాల్సిన అధికార, ప్రతిపక్ష నాయకులు పట్టించుకోకపోవడంపై వేరే రకమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- కలెక్టర్ ఆదేశాలు హుష్ కాకీ...

బొగ్గు ఓవర్ లోడ్ కారణంగా రోడ్లు పూర్తిగా ఛిద్రమైపోవడంతో పాటు అతివేగం, కవర్ పట్టా వేయకుండా బొగ్గు లారీలు నడస్తున్న తీరుపై కలెక్టర్ రాహుల్ శర్మ సీరియస్ అయ్యారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ దిశగా సంబంధిత పోలీస్ శాఖ ,ఆర్టీవో,ఆర్అండ్బీ,ఇతర త్రా అధికారులతో తరుచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ బొగ్గు ఓవర్ లోడ్ తతంగాన్ని పూర్తిగా కట్టడి చేశారు.ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా పాసింగ్ తోనే బొగ్గు లారీలు నడవగా ఇలా అయితే తమ వ్యాపారం దిబ్బతింటుందనే కుటిల పన్నాగంతో కాంట్రాక్టర్లు, ప్రైవేట్ కంపెనీ, జెన్కో అధికారులు కాస్తా ఓ కమిట్మెంట్ కు వచ్చారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఓవర్ లోడ్ ఆపేది లేదని అవసరమైతే కలెక్టర్ ను ఎదుర్కొనైనా సరే తమ దందాను కొనసాగించి తీరాల్సిందేనని భావించుకుని దందాకు తెరలేపిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఓవర్ లోడ్ తతంగంపై అలెర్ట్ గా ఉన్న కలెక్టర్ కు ప్రభుత్వ రాజకీయ పెద్దలతో ఒత్తిడి చేయించి మరీ దందాకు మళ్లీ తెరలేపినట్లుగా విశ్వసనీయ సమాచారం.అంతలా కలెక్టర్ స్థాయి అధికారినే ఏలుతున్న సదరు కాంట్రాక్టర్లు,కంపెనీ యాజమాన్యం,జెన్కో అధికారులు తమకు ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తూ దందాను సాగించుకోవడం విశేషమనే చెప్పుకోవచ్చు.

- టార్గెట్ రీచ్ పేరుతో ఓవర్ లోడ్

తాడిచర్ల ఓపెన్ కాస్ట్ నుండి జెన్కో కు నిత్యం 7300 టన్నుల బొగ్గుని వెలికి తీసి తరలించాల్సింది ఉండగా అందుకు తగ్గ వాహనాలను సమకూర్చుకోకుండా సదరు కంపెనీ వినూత్న దందాకు తెరలేపింది.7300 టన్నుల బొగ్గుని తరలించాల్సి వస్తే అధిక సంఖ్యలో లారీలు అవసరమవుతుండగా ఓవర్ లోడ్ తో పోతే తక్కువ లారీలు అవసరమవుతాయని భావించి ఓవర్ లోడ్ దందాకు పూనుకున్నారు.ఈ క్రమంలో గత కొన్నేళ్లుగా ఓవర్ లోడ్ దందాను దర్జాగా సాగిస్తుండగా అడ్డొచ్చే ఎంతటి వ్యవస్థనైనా సరే తన సీల్డ్ కవర్లతో కవరింగ్ చేసుకుంటూ వచ్చింది.ఇంతలా బాహాటంగా జరుగుతున్న ఓవర్ లోడ్ దందా తీరుపై అక్షర దర్బార్ వరుస కథనాలు ప్రచురించడం స్పందించిన జిల్లా స్థాయి అధికారులంతా ఓవర్ లోడ్ దందాను నిలిపివేయడం జరిగిపోయింది.20 రోజులుగా ఓవర్ లోడ్ నిలిచిపోవడం జెన్కో కు సదరు ప్రైవేట్ సంస్థ జెన్కో కు అందించాల్సిన బొగ్గు రవాణా టార్గెట్ తగ్గిపోవడంతో జెన్కో సంబంధిత ఉన్నత స్థాయి ఉన్నతాధికారులు ప్రయివేట్ కంపెనీ పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎలాగైనా సరే ఎంతటివారినైనా ఎదురించి ఓవర్ లోడ్ దందాకు పూనుకున్న సదరు కంపెనీ కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకువచ్చి మరీ ఓవర్ దందాను కొనసాగిస్తున్నారు. ఇక పట్టించుకోవాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం పూర్వ స్థితిలోకి వచ్చి వారికే వంతు పాడుతున్నట్లుగా జోరుగా ప్రచారం జరుగుతుంది.

డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కౌన్సిలర్ పూర్ణచారి

కాలనీ ప్రజల సంక్షేమమే ముఖ్యం..

9వ వార్డు కౌన్సిలర్ పూర్ణ చారి

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని మున్సిపల్ 9వ వార్డు లో మురికినీరు నిల్వ ఉండడంతో కాలనీలో దోమల బెడద పెరుగుతుందని గమనించిన మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి స్థానిక మున్సిపాలిటీ పారిశుద్ధ కార్మికులతో తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ తన వార్డు ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని వార్డులో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని అన్నారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలతో తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా నోడల్ ఆఫీసర్ సాయి శ్రీధర్

అక్షర దర్బార్, నర్సంపేట : ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా నోడల్ ఆఫీసర్ సాయి శ్రీధర్ తెలిపారు శుక్రవారం శుక్రవారం నర్సంపేట పట్టణం లోని ఎస్సార్ ఎస్సార్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ను జిల్లా నోడల్ అధికారి సాయి శ్రీధర్ సందర్శించి వసతులనుపరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుండి 22 వరకు జరిగే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ను ఎలాంటి అవకతవకలు జరగకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం లో కళాశాల ఛైర్మెన్ అండ్ ప్రిన్సిపాల్ కొయ్యాడి సనత్ కుమార్ కళాశాల డైరెక్టర్ కొయ్యడి శిరీష, వైస్ ప్రిన్సిపాల్ అజ్మీరా సూరయ్య, లెక్చరర్స్ పాలడుగుల సంతోష్, లయన్ ప్రవీణ్ , నూనవత్ రమేష్ బోడ వెంకన్న, నునావత్ రమేష్ వరంగంటి సందీప్ శ్వేత , శాతరాసి కుమార్, బాదావత్ దేవ్ సింగ్, జరుపుల సునీత తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ కు ఊరట..

- 30వ తేదీ వరకు అరెస్ట్ చేయొద్దు
- ఏసీబీకి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 27కు వాయిదా
- ఫార్ములా ఈ -రేస్ లో కీలక పరిణామం

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణవ్యాప్తంగా సంచలనం రేపుతున్న ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే.. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్పై ఏసీబీ కేసు నమోదు చేయగా.. ఇక అరెస్టే తరువాయి అంటూ పెద్దఎత్తున వార్తలు వైరల్ అయ్యాయి. ఈక్రమంలోనే.. కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించగా.. భారీ ఊరట లభించింది. కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఏసీబీకి కీలక ఆదేశాలు జారీచేసింది. ఈనెల 30వ తేదీ వరకు కేటీఆర్ను అరెస్టు చేయొద్దని ఏసీబీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. అంతేకాకుండా.. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని ఆదేశించింది ధర్మాసనం.. విచారణ కొనసాగించొచ్చని హైకోర్టు తెలిపింది. విచారణకు కేటీఆర్ సహకరించాలని ఆదేశాల్లో పేర్కొంది. తనపై పెట్టిన కేసు కొట్టేయాలన్న కేటీఆర్ పిటిషన్ను మాత్రం హైకోర్టు తిరస్కరించటం గమనార్హం.

చిన్న కాళేశ్వరం పనులు పూర్తి చేయాలి

పనులను పరిశీలించిన భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్, మహదేవపూర్ : గడువు లోపు చిన్న కాళేశ్వరం హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బీరసాగర్ వద్ద నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి నెల వరకు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు పూర్తి చేసి 250 మీటర్ల వరకు నీటిని తరలించేందుకు నిర్దేశ సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మహదేవపూర్ గిరిజన ఆశ్రమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మాయాక్ సింగ్, ఇరిగేషన్ ఈఈ యాదగిరి, మహదేవపూర్ తహసీల్దార్ కృష్ణ, డీఈలు సూర్యప్రకాష్, ఉపేందర్ పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

బీఆర్ఎస్ లో కలకలం

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు
- పొలిటికల్ సర్కిల్ లో హాట్ టాపిక్ గా మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్ వ్యవహారం

అక్షరదర్బార్, హైదరాబాద్: ఫార్ములా ఈ–రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ అవుతాడని ప్రచారం జరుగుతున్న వేళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల వ్యవహార శైలి గులాబీ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరుగుతున్న ప్రస్తుత తరుణంలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, అంబర్పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సీఎం రేవంత్ రెడ్డిని కలవడం హాట్ టాపిక్గా మారింది. అయితే వీరిద్దరూ నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రిని కలిశారని గులాబీ పార్టీ శ్రేణులు చెబుతున్నప్పటికీ.. గత కొంతకాలంగా ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరుతారని ప్రచారం సాగుతోంది. ఈక్రమంలోనే సీఎంను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.